క్లుప్తంగా

సీహెచ్‌సీకి దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందజేస్తున్న మధు

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల సౌకర్యార్థం స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని ఆదివారం దుప్పట్లు, టవళ్లు అందజేశారు. పట్టణానికి చెందిన ఇంజినీర్ మధు ఆర్థిక సహకారంతో 40 దుప్పట్లు, 40 టవళ్లను సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కాశీం సాహెబ్, విక్కీఫౌండేషన్ అధినేత ప్రతాప్‌రెడ్డి, మైకేల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎదురుకోళ్ల ఉత్సవం



గోదాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

డోన్: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం ఎదురుకోళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రంగనాథ స్వామికి పల్లకీసేవ, విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్ శర్మ, రాముశర్మ, ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న గరివిరెడ్డి

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా చింతలాయిపల్లెలో ఆదివారం అంబటి శివశంకర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గురివిరెడ్డి ప్రారంభించారు. చింతలాయిపల్లె పంచాయతీ పరిధిలోని ఎస్.చెన్నంపల్లె, మదనంతపురం, రాఘవరాజుపల్లె గ్రామాలకు చెందిన క్రీడాకారుల కోసం ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. గెలుపొందిన జట్లకు రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి చంద్రమోహన్‌రెడ్డి, నీలం సంజీవకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యుడు

డోన్: పట్టణానికి చెందిన ద్రోణాచలం సేవా సమితి సభ్యులు ఆదివారం పాతపేటలో మృతి చెందిన గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు. సమితీ సభ్యులు షాదిఖానా రాజు, గురుస్వామి, దాదాహుసేన్, కరుణాకర్, బుక్‌స్టాల్ మల్లి, హేమంత్‌రెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షునికి సత్కారం



సోమేష్‌యాదవ్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం నేతలు

డోన్: వైఎస్సార్‌సీపీ డోన్ మండల అధ్యక్షుడిగా తాపలకొత్తూరు సోమేష్ యాదవ్ నియామకంపై యాదవ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమేష్ యాదవ్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, యాదవ సంఘం నేతలు సుధాకర్, రామక్రిష్ణ, రాజు, ఆంజనేయులు, బాలవర్ధిరాజు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మారుద్దాం



స్టీల్ గ్లాసులు, ప్లేట్లు పంపిణీ చేస్తున్న బీసీ ఇందరమ్మ

బనగానపల్లె: ప్లాస్టిక్ రహిత పట్టణంగా బనగానపల్లెను మారుద్దామని.. ఇందుకు అందరి సహకారం అవసరమని బీసీ ఇందిరమ్మ అన్నారు. సంక్రాంతి నుంచి ప్లాస్టిక్ వస్తువుల వాడకం నిషేధంలో భాగంగా పట్టణ ప్రజలకు ఆదివారం స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. సంక్రాంతి నుంచి బనగానపల్లెను వందశాతం ప్లాస్టిక్ రహితంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అందరూ తమవంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు.

గజ.. గజ

పడిపోయిన ఉష్ణోగ్రతలు.. వణికిస్తున్న చలి

- ఉదయం పూట కప్పేస్తున్న పొగ మంచు
- వ్యాధులు ప్రబలే అవకాశం
- నిరాశ్రయులు, అభాగ్యుల బాధ వర్ణనాతీతం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు


డోన్: రోజురోజుకూ చలి పెరుగుతుండడంతో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. ప్రజలు చలి తీవ్రతకు గజగజ వనికిపోతున్నారు. ఉదయం 9 గంటలైనా పొగ మంచు వీడడం లేదు. రాత్రివేళల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లతో పాటు ఆరుబయట ప్రదేశాల్లో నిద్రించే అభాగ్యులు, నిరాశ్రయుల బాధ వర్ణనాతీతంగా ఉంది. మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇలాంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కర్నూలు సర్వజన వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవక్రిష్ణ మాటల్లో..

నిత్యం అప్రమత్తత అవసరం

రోజువారి తీసుకునే ఆహారం, మంచినీరు నుంచి ధరించే దుస్తుల వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా చలి ఉన్నప్పుడు ఆరుబయట తిరిగితే న్యూమోనియా వ్యాధితో పాటు శ్వాస సంబంధిత వ్యాధులు, అలర్జీ, ఆస్థమా విజృంభించే అవకాశం ఉంటుంది. ఇస్నోసియాలో గుండెకు సంబంధించిన రోగులు, పిల్లలు, బాలింతలు, వృద్ధులు, గర్భిణులు శరీరాన్ని ఎల్లప్పుడూ వేడిగా ఉంచేందుకు ప్రయత్నించాలి.

తస్మాత్ జాగ్రత్త

చలిగాలులు తీవ్రంగా వీచేటప్పుడు సూక్ష్మజీవులు గాలిలో అధికంగా ఉంటాయి. అవి గాలి ద్వారా శరీరంలోకి ప్రవేశించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. అందుకే చలిగాలిలో ప్రయాణించేవారు, వాకింగ్ చేసేవారు ముక్కు, చెవి, నోటిలోకి గాలి వెళ్లకుండా మంకీ క్యాప్‌లు, తలపాగాలు ధరించాలి. మధుమేహం, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారు ఎట్టి పరిస్థితుల్లో చల్లటి గాలుల్లో బయటకు వెళ్లరాదు. శరీరాన్నంతటిని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించడంతో పాటు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవడం మంచిది. జలుబు, దగ్గు లాంటి వ్యాధులు తగ్గకుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం. గోరువెచ్చని నీటిని అధికంగా తాగితే కాస్త ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వయో వృద్ధులను బయట తిరగకుండా జాగ్రత్త వహిస్తే మంచిది.



డోన్‌లో తెల్లవారుజామున కురుస్తున్న మంచు

ఇంత చలి ఎప్పుడూ లేదు



మధ్య ఉత్తర భారత దేశానికి వీస్తున్న గాలుల కారణంగా చలితీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు ఘననీయంగా పడిపోయాయి. వాతావరణంలో ఆకస్మిక మార్పుల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు అనేక బాధలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా రాత్రి, ఉదయం వేళల్లో బయటకు రాలేని పరిస్థితి. జలుబు, జ్వరం, ఊపిరి ఆడకపోవడం లాంటి సమస్యలతో బాధపడాల్సి వస్తోంది. ఇలాంటి రుగ్మతల బారిన పడే కన్నా ఇంటి పట్టున ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మంచిదని భావిస్తున్నాం. –గోపాల్, రిటైర్డు టీచర్, డోన్

అప్రమత్తత అవసరం



చలి ఎక్కువగా ఉండేటప్పుడు బీపీ, షుగర్ లాంటివి హెచ్చుతగ్గులు సంభవించే అవకాశం ఉంది. వేకువజామున రోగులు వాకింగ్, జాగింగ్ వెళ్లకుండా ఉంటే మరీ మంచిది. ఇప్పుడు వీస్తున్న విపరీతమైన చలి గాలులకు రక్తం గడ్డకట్టడం ద్వారా గుండెపోటు, పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్ లాంటివి వచ్చే ప్రమాదం ఉంది. వైద్యుల సలహా మేరకే రోగులు, చిన్నపిల్లలు, వయోవృద్ధులు బయట తిరగాలి. –డాక్టర్ మాధవక్రిష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు సర్వజన వైద్యశాల

వ్యవసాయానికి ఈవారం విద్యుత్ వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపా డు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపురి, రెడ్డిపల్లె, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, మిక్కినేనిపల్లె గ్రామాల్లో పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

బేతంచెర్ల: పట్టణంలోని అల్లాబకాష్ దర్గా సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. పట్టణానికి చెందిన షేక్ నబీ సాహెబ్, ఇంతియాజ్, అబ్దుల్లా, హుసేన్ బాషా, వడ్డె శ్రీనుతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.8,650 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సందడిగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



బేతంచెర్లలో ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు, బాలికలు,



బహుమతులు ప్రదానం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: గ్రామీణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆదివారం స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పండుగ విశిష్టను తెలియజేసేలా వివిధ ఆకృతుల్లో వేసిన ముగ్గులు కనువిందు చేశాయి. రాజేశ్వరమ్మకు ప్రథమ బహుమతిగా దాత బుగ్గన ప్రభాకర్‌రెడ్డి సహకాంతో ఫ్రిజ్, రాయపాటి నాగమయ్య సహకారంతో ద్వితీయ బహుమతి లక్ష్మీదేవికి డబుల్ కాట్ మంచం, మద్దిలేటి సహకారంతో తృతీయ బహుమతి మల్లేశ్వరికి డ్రస్సింగ్ టేబుల్, రామ సుబ్బారెడ్డి సహకారంతో మాధవికి గ్యాస్‌స్టవ్ అందజేశారు. ప్రోత్సాహక బహుమతులు స్వామినాథ్ సహకారంతో అనిత, వైష్ణవికి రూ. 2 వేల నగదు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు దాతల సహకారంతో గిఫ్ట్ హ్యాంపర్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్లు సముద్రాల మద్దిలేటిస్వామి, గుండా గోపాలు, రోటరీ అధ్యక్ష,కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్, సభ్యులు విజయగోపాల్, మగ్బుల్, అహ్మద్ హుసేన్, సుబ్బారెడ్డి, రామూర్తి, ఫయాజ్, పవన్, అక్తాబ్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



డోన్: బహుమతులు అందుకున్న మహిళలతో నిర్వాహకులు

డోన్ టౌన్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మారం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు.

నేడు ముగ్గుల పోటీలు

డోన్ టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని డీఎస్పీ కార్యాలయం సమీపంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారికి రంగులు, ముగ్గు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామానికి చెందిన డాబగార్ల కైరున్‌బీని అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నారని ఆదివారం ఎస్‌ఐ రమణ్య కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. ఆర్.లింగందిన్నె గ్రామానికి చెందిన కైరున్‌బీకి నాలుగేళ్ల క్రితం చాగలమర్రి మండలం ముత్యాలపాడు గ్రామానికి చెందిన షఫీతో వివాహం జరిగింది. కొద్ది రోజుల నుంచి భర్తతో పాటు అత్త మాబ్బి, మామ సత్తార్, తోడికోడల్లు కలిసి అదనపు కట్నం కోసం శారీరకంగా, మనసికంగా వేధిస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు మేరకు భర్త,అత్త మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోంగార్డు దాష్టీకం



హోంగార్డుదెబ్బలకు వాచిపోయిన బాలుడి మొహం

డోన్: వాస్తవం తెలుసుకోకుండానే 11 ఏళ్ల బాలుడిపై చేయి చేసుకున్న హోంగార్డు ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక పాతబస్టాండ్ వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సుధాకర్ తన ద్విచక్ర వాహనం సీటు చించివేశాడని మోహన్‌క్రిష్ణారెడ్డి అనే బాలుడి దవడపై గట్టిగా కొట్టాడు. దీంతో ఆ బాలుడు బాధతో కాసేపు విలవిలలాడగా, అక్కడ ఉన్న వారు జోక్యం చేసుకుని హోంగార్డుతో వాదనకు దిగారు. అంతలోగా బాలుడి తండ్రి మున్సిపల్ ఉద్యోగి అయిన కోటకొండ లక్ష్మిరెడ్డి అక్కడికి చేరుకుని హోంగార్డు సుధాకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా తప్పు చేస్తే విచారించి పెద్దలకు చెప్పాలే కానీ, చట్టాన్ని చేతులోకి తీసుకుని చితకబాదుతావా అంటూ నిలదీశారు. ఇంతలో అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్స్ సర్దిచెప్పి లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులను అక్కడి నుంచి పంపించి వేశారు.

సాయంలోనే నిజమైన పండుగ

డోన్ టౌన్: నిరుపేదలకు సహాయం చేసినప్పుడే నిజమైన సంక్రాంతి అని స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపకుడు ఆలా మధు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం దాతల సహాయంతో డోన్ పట్టణంలో పలువురు పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

మైనేని వెంకటరత్నంకు నివాళి

బనగానపల్లె రూరల్: యూటీఎఫ్ మొదటి ప్రధాన కార్యదర్శి మైనేని వెంకటరత్నం వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్, సత్యప్రకాష్, వెంకటేశ్వర్లు, సుధాకర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


మద్దిలేటిస్వామికి పంచలోహ తొడుగు కానుక

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటిస్వామికి గ్రామస్తులు పంచలోహ తొడుగును కానుకగా సమర్పించారు. ఆదివారం ఆలయ అర్చకుడు తిమ్మయ్యకు అందజేశారు. గ్రామంలో విరాళాల ద్వారా సేకరించిన రూ.35 వేలతో పంచలోహ తొడుగును తయారు చేయించినట్లు గ్రామస్తులు తెలిపారు.



ఆలయ అర్చకులకు అందజేస్తున్న దాతలు

ప్రకృతి వరాలు.. కలువ పూలు



చెరువులు, నీటి కుంటలు, కాలువల్లో కలువపూలు చాలా అందంగా కనిపిస్తుంటాయి. అందుకే అందమైన అమ్మాయిల కళ్లను కలువ పూలతో వర్ణిస్తుంటారు. నీటి లోపల భాగంలోనికి పొడవాటి కాడతో పెరిగే ఈ పువ్వులు తెలుపు, గులాబీ, నీలం రంగుల్లో ఉంటాయి. ఇంగ్లిష్‌లో వీటిని వాటర్ లిల్లీ అని పిలుస్తుంటారు. కోర్నపల్లె సమీపంలోని పురాతన గుండం ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉన్న కొలనులో కలువ పూలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నీళ్లలో వెడల్పాటి ఆకులు తివాచీ పరిచినట్లుగా కనిపిస్తూ అక్కడక్కడ విచ్చుకున్న తెల్లటి పూలు కట్టిపడేస్తున్నాయి. – కొలిమిగుండ్ల



కోవెలకుంట్ల: 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

కోవెలకుంట్ల: స్థానిక వీరభద్ర ఫంక్షన్ హాలులో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసుకున్న 80 మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా ఒక వేదికపై చేరారు. వీరంతా ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్లు, ఇంజినీర్లు, ఆర్మీ, వ్యాపారాలు, వ్యవసాయం చేసుకుంటూ కోవెలకుంట్ల, నంద్యాల, కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ వేదిక ద్వారా కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సుమారు 33 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటలను పంచుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ముత్తోజ్ వీరబ్రహ్మం, ఓబులేసు, జీవీ సుబ్బారెడ్డి, కాశయ్య, నాగేంద్రప్పను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు శివప్రసాదరెడ్డి, హరీష్, మనోహర్, జాకీర్ ఉసేన్, కరుణ, సుబ్బరాయుడు, ఇస్మాయిల్, కృష్ణయ్య, సత్తార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బేతంచెర్ల: గురుశిష్యుల బంధం చాలా గొప్పదని రిటైర్డ్ హెచ్‌ఎం మద్దిలేటిస్వామి అన్నారు. మండల పరిధిలోని ఎం.పేండేకల్లు జెడ్పీ హైస్కూల్‌లో 2008–09 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను తెలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం మద్దిలేటి, హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు నాగరాజు, గిడ్డయ్య, మద్దిలేటి స్వామి, కేశవ రాణి, సౌజన్య, ప్రమీల, లోకేశ్వరి, బాలరాజు, వలిను సత్కరించారు. పూర్వ విద్యార్థులు చిన్న నాగ మద్దయ్య, గంగాధర్‌రెడ్డి, మహేంద్రారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గోపాలు, హేమలత పాల్గొన్నారు. అలాగే ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో 1993–94 బ్యాచ్ విద్యార్థులు కలుసుకున్నారు. సుమారు 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఎలా ఉన్నావ్.. ఎంత మారిపోయావ్ అంటూ పలకరించుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఎంఈఓ డీవీ నారాయణ, హెచ్‌ఎం మల్లికార్జునయ్య, ఉపాధ్యాయులు పిచ్చంరాజు, సుదర్శన్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. పాఠశాలకు బీరువాను బహూకరించారు. పూర్వ విద్యార్థులు పరమేష్, నరసింహ, శంకర్, రాధాకృష్ణ, సుబ్బయ్య, కృష్ణవేణి, ఆదినారాయణమ్మ, వీరలక్ష్మి, నాగసులోచన పాల్గొన్నారు.



బేతంచెర్ల: ఎం.పెండేకల్లు జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు



రంగాపురం జెడ్పీ హైస్కూల్ 1993-94 బ్యాచ్ విద్యార్థులు

వివేకానందుని మార్గం అనుసరణీయం

- ఘనంగా వివేకానందుని జయంతి వేడుకలు

కోవెలకుంట్ల: యువత స్వామి వివేకానందుని అడుగు జాడల్లో నడవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల్లో ఆదివారం స్వామి వివేకానందుని 161వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ఉన్న వివేకానందుని విగ్రహానికి వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక లైబ్రరీ ఆవరణలో రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, అధ్యాపకుడు తిమ్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న నివాళులర్పించారు. మనసంస్కృతి, సంప్రదాయాలు, భారతీయత, స్నేహం, సహకారం, పరోపకారం, చేదోడువాదోడుతనం, సనాతనధర్మం స్వామి అందించిన దివ్యసందేశమన్నారు. దృఢమైన ఆత్మవిశ్వాసంతో భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుకోవాలన్న సంకల్పం కలిగి ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, సంటిరెడ్డి, సుభాష్‌రెడ్డి, పుల్లయ్య, కృష్ణయ్య, రేవనూరు మాజీ సర్పంచ్ ఉసేని, పరంధామరెడ్డి పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు ఘన నివాళి

డోన్: యువతరానికి స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, సభ్యులు రామదాస్ రెడ్డి, ఆంజనేయులు, మౌలాలి పాల్గొన్నారు.

➤డోన్ టౌన్: ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి ఆవోపా, వివేకానంద సేవా సమితి, డోన్ వేద బ్రాహ్మణ సంఘం, గీతా యోగాసన సంఘం, ఉపాధ్యాయుల సంఘం సభ్యులు వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయా కార్యక్రమాల్లో వివేకానంద సేవా సమితి వ్యవస్థాపకుడు జగన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, అధ్యక్షకార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, వేద బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు గండ్లూరి దత్తాత్రేయశర్మ, అధ్యక్ష, ఉపాధ్యక్షులు శంకశర్మ, శేషావలిశర్మ, ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, సర్వజ్ఞమూర్తి, కృష్ణారావు, ఏఈ నాగరాజు, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

➤సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు పుస్తక సంక్షిప్త కేంద్రం నిర్వహకుడు మద్దిలేటి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మిద్దె కృష్ణమూర్తి, సందీప్ పాల్గొన్నారు.

➤బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో జయంతి వేడకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద జీవిత చరిత్రను గుర్తు చేశారు. ఆయా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్, రమణ, పట్టణ, మండల అధ్యక్షులు గుండాగోపాలు, కందగడ్డల జనార్ధన్ పాల్గొన్నారు.

➤ప్యాపిలి: స్థానిక సరస్వతీ శిశు మందిరంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు వాసు, శ్రీను, పార్వతి, చంద్రహాసన్, రామాంజనేయులు, రాజేశ్వరి, అనూష తదితరులు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల: నివాళులర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి



డోన్: ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో..



డోన్: ఆవోపా ఆధ్వర్యంలో..



డోన్: స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సంజామలలో..



బేతంచెర్లలో నివాళులర్పిస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు